ఆదమరిస్తే అంతే సంగతులు

- ● పొంచి ఉన్న ప్రమాదం
- ● పట్టించుకోని అధికారులు

అడు గడుగునా పొంచి ఉన్న ప్రమాదం.. ఆదమరిస్తే ప్రమాదం పలకరిస్తుంది. ఆయా మార్గాల్లో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలువురి ఉసురు తీశాయి. అయినా అధికారుల్లో చలనం లేదు. వాహనదారుల భద్రత చర్యలు తీసుకోవటంలో తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా నిత్యం భయం భయంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

కంకిపాడు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా కంకిపాడు-గన్నవరం రోడ్డు మార్గంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతం ఉప్పలూరు వంతెన పరిసరాలు. వంతెన దిగువున ఉన్న ప్రమాదకర మలుపు, వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా ఏళ్ల క్రితం వాహనదారుల రక్షణ నిమిత్తం వంతెనకు ఇరువైపులా డబ్ల్యూ బీమ్ క్రాష్ బారియర్స్ నిర్మించారు. వాహనాలు అదుపుతప్పితే నేరుగా రైవస్ కాలువలోకి దూసుకెళ్లకుండా బారియర్స్ అడ్డుగా నిలుస్తాయి. అలాంటి బారియర్స్ వాహనాలధాటికి ధ్వంసమయ్యాయి. కొందరు పంట పొలాలకు రాకపోకలకు వీలుగా బారియర్స్ తొలగించారు. దీంతో పలు ప్రాంతాల్లో బారియర్స్ కనుమరుగయ్యాయి. ఫలితంగా వంతెన పరిసరాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఎప్పుడెలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం వాహనచోదకులను వెంటాడుతోంది. వాహనాలు అదుపుతప్పితే నేరుగా 20 అడుగుల లోతున ఉన్న రైవస్ కాలువలోకి దూసుకెళ్లిపోయే పరిస్థితి.

గతంలో ఎన్నో ప్రమాదాలు..

వేగంగా వెళ్తున్న వాహనాలు ఉప్పలూరు వంతెన పరిసరాల్లో అదుపుతప్పి నేరుగా రైవస్ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఎందరో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. దశాబ్దకాలం క్రితమే ఈ ప్రాంతంలో పటిష్టమైన బారియర్స్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఆ మేరకు ఆర్అండ్‌బీ అధికారులు ఒకానొక దశలో అంచనాలను కూడా రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే కాలక్రమంలో అవి కేవలం ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి.

బారియర్స్‌తోనే రక్షణ పటిష్టం

ప్రస్తుతం వంతెన పరిసరాలు ప్రమాదకరంగా తయారయ్యాయి. గతంలో ఉన్న బారియర్స్ ధ్వంసమై పొంచి ఉన్న ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు పరిస్థితి చేయి దాటకముందే ప్రమాదకర ప్రదేశాల్లో వాహనదారుల భద్రత నిమిత్తం బారియర్స్ ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తద్వారా ప్రత్యేకించి రాత్రిళ్లు రోడ్డు మార్జిన్‌లు, ప్రమాదకర పరిస్థితులుపై వాహనదారులకు స్పష్టత వస్తుంది. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటే మేలు అని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద కానరాని బారియర్స్



బారియర్స్ తొలగించి రోడ్డు నిర్మించిన ప్రదేశం



రాకపోకలకు వీలుగా బారియర్స్ తొలగించటంతో ..



ఉప్పలూరు వంతెన మలుపు వద్ద ధ్వంసమైన బ్రిడ్జి రక్షణ గోడ



ఆదమరిస్తే కాలువలోకి దూసుకెళ్లిపోవమే..

ప్రతిపాదనలు ఏమీ లేవు

గతంలో ఉన్న బారియర్స్‌ను రోడ్లు కోసం, రాకపోకలకు తొలగించేశారు. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవు. వంతెన పరిసరాలు ప్రమాదకరంగా మారాయన్న మాట వాస్తవమే. ఉన్నతాధికారులకు సమస్య వివరిస్తాం.

– మల్లికార్జున, ఏఈ, ఆర్అండ్‌బీ, కంకిపాడు

క్లుప్తంగా

క్రీస్తు బోధనలు అనుసరణీయం



గన్నవరం: క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని ఆర్‌సీఎం గన్నవరం విచారణ గురువులు ఫాదర్ పసల థామస్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌సీఎం బాలయేసు ఆలయంలో ఆదివారం ఇన్సెంట్ జీసెస్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండి, తోటి వారికి సాయపడాలన్నారు. కాన్ఫరెన్స్ అధ్యక్షుడు పసల రత్నం, కార్యదర్శి రాబర్ట్ జాన్సన్, విజయవాడ సీసీ మాజీ అధ్యక్షుడు వీపీ. విజయకుమార్, విచారణ కౌన్సిల్ చైర్మన్ కాటం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం



కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడుకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామం ప్రొద్దుటూరు. దీనికి కొణతనపాడు, యార్లగడ్డ వారిగూడెం గ్రామాలు శివారు గ్రామాలుగా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం గ్రామంలో విస్తరిస్తోంది. ఇన్నింటి నడుమ గ్రామంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా ప్రొద్దుటూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి వీధి దీపాలు ఏర్పాటుచేశారు. అనేక చోట్ల ఈ వీధి దీపాలు వెలగటం లేదు. ప్రజలు పలుమార్లు సచివాలయ అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పరిస్థితిలో మార్పు లేదు. రాత్రిళ్లు ఈ మార్గం గుండా ప్రయాణించే క్రమంలో అవస్థలు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో శ్రీ రామభక్త అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో కోదండరామాలయం వద్ద శనివారం రాత్రి పడి భజన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు చిమటా ప్రసాద్, తాత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. మాలధారులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

సూర్యోపాసన శ్రేయస్కరం

విజయవాడకల్చరల్: సూర్యారాధన, సూర్యోపాసన సర్వవిధాల శ్రేయస్కరమని లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సూర్య నమస్కారాలు, అరుణ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవంగా భక్తులు విశ్వసిస్తారన్నారు. సూర్యభగవానుని ఆరాధించే సంస్కృతి భారతీయ సనాతన ధర్మంలో ఉందని చెప్పారు. భారతీయులు పవిత్రంగా భావించే పండుగలన్నీ సూర్యమానంతోనే ప్రారంభమవుతాయన్నారు.

ఎంబీ స్టేడియాన్ని ఆధునికీకరించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియాన్ని అధునాతన వసతులతో ఆధునికీకరించాలని డీవైఎఫ్‌ఐ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కే నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఎంబీ స్టేడియం గ్రౌండ్‌ను ఆధునీకరించాలని కోరుతూ ఆదివారం నిరసన, బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ స్టేడియాన్ని ప్రైవేటు, ఇతర కార్యక్రమాలకు తరచూ ఇవ్వటం వల్ల స్టేడియం గ్రౌండ్ అంతా గోతులమయంగా మారి వాకర్స్, క్రీడాకారులకు అక్కరకు రాకుండా పోతుందన్నారు. గోతులమయమైన మైదానంలో కొద్దిపాటి వర్షం పడినా ఆ నీరంతా గ్రౌండ్‌లో నిలిస్తోందని చెప్పారు. ఈ ప్రభుత్వ పాలకులకు, కార్పొరేషన్ అధికారులకు ప్రైవేట్ కార్యక్రమాలకు అద్దెలకిచ్చి డబ్బు సొమ్ము చేసుకోవడంపైన ఉన్న శ్రద్ధ స్టేడియం ఆధునికీకరించడంపై లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత వహించి స్టేడియంలోని గోతులు పూడ్చించి బురదమయం కాకుండా డస్ట్ పోయించి మెరక చేసి లెవలింగ్ చేయించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ చెన్ను ప్రసన్న అధ్యక్షతన సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ శాఖలపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాల్లోని అభివృద్ధి, తదితర అంశాలపై సమగ్ర నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇతర అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

వెంకటేశ్వరుని ఆలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీ పోరాటం



కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించిన చక్రవర్తి, శ్రీనివాసరెడ్డి, నాయకులు

- ● మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- ● దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం కాకుండా వారి భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని పెనమలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి అన్నారు. గోసాలలో ఆదివారం పెనమలూరు, కంకిపాడు మండలాల పార్టీ ముఖ్యనేతలతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను రాష్ట్ర పార్టీ కార్యదర్శి, పెనమలూరు, మైలవరం నియోజకవర్గాల పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలతో కలిసి చక్రవర్తి ఆవిష్కరించి ప్రసంగించారు. మెడికల్ కాలేజీలకు చెందిన లక్ష కోట్లు విలువజేసే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటికరణను ప్రతిఘటిస్తామన్నారు. పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే కలను చంద్రబాబు దూరం చేస్తున్నారని ఆరోపించారు.

60 వేల సంతకాల సేకరణ

పేదవాడికి వైద్య విద్య ,ఉచిత వైద్యం అందకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతుందని దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. పెనమలూరు నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాలు ప్రజల నుంచి సేకరిస్తామన్నారు. రచ్చబండల వద్ద కార్యకర్తలు ఉద్యమంలా సంతకాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు త్వరలో వేసి పార్టీ బలోపేతం చేస్తామన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలు ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను అందరికీ అండగా ఉంటానన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కాలేజీలు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రజల వద్ద నుంచి కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేసి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. గోసాల సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల విలువ రూ.60 వేల కోట్లు ఉంటుందని, ప్రభుత్వం బడాబాబులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు పి.రాఘవరావు, అబ్దుల్ అష్రఫ్, చక్కాగోపీ, పోలవరపు రవి, మండూరు కోటేశ్వరరావు, తమ్మాబత్తుల ఓంకారం, ఎంపీటీసీ కోనాకిషోర్, మంతెన సుబ్బారావు, లింగాల శోభన్ బాబు,టెక్కం సతీష్, మల్లంపల్లి వెంకటేశ్వరరావు, బందెల సుబ్బారావు, బి.నాగిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, గని, రహీం, మరీదు విజయ్‌కుమార్, వణుకూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కార్తికమాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకూ కార్తిక మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. కార్తికమాసం ప్రారంభం నుంచి ఆలయంలో పలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆకాశదీపంతో కార్తిక మాసం ప్రారంభమవుతుందని తెలిపారు. నాగుల చవితి, నాగ పంచమి, కార్తికమాస సోమవారాలు వరుసగా జరుగుతాయని పేర్కొన్నారు. నవంబరు 18న మాస శివరాత్రి, అన్నాభిషేకం, నవగ్రహ మహామృత్యుంజయ సహిత రుద్ర హోమం, 21న పోలి పాడ్యమితో కార్తికమాస పూజా కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

ఉత్తమ రైతులకు సత్కారం



పామర్రు: రైతుల దినోత్సవం సందర్భంగా పామర్రు సెంటర్‌లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యాన ఆదివారం పలువురు రైతులను సత్కరించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని పేర్కొన్నారు. రైతులు కష్టపడి పండిస్తే వాటిని మనం అందరం అనుభవిస్తున్నామని అన్నారు. అనంతరం కళాపీఠం ఆధ్వర్యంలో పామర్రు మండలంలోని ఆరుగురు ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు భీమవరపు శ్రీనివాసరెడ్డి, కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, సభ్యులు సల్మాన్ కొల్లాబత్తుల కొండ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. దొంగతనాలు, గొడవలు, అక్రమ మద్యం, మాదకద్రవ్యాల అమ్మకాలు, కోతముక్క, కోడి పందాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ లోకేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకారవేతనాలు అందజేత



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేసిన పారిశ్రామికవేత్త రాజేంద్రప్రసాద్, కోనేరు ట్రస్టు సభ్యులు

పెనమలూరు: గోసాలలో కోనేరు చారిటబుల్‌ట్రస్టు విద్యార్థులకు ప్రతిభా పురస్కాల కింద రూ 9.26 లక్షలు ఉపకార వేతనాలు విద్యార్థులకు అందజేశారు. గోసాల వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ సంఘ సేవకురాలు సత్యవాణి విద్యార్థులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ఉపాధి అవకాశాల కోసం తాను గ్రామీణ ప్రాంతంలోనే పరిశ్రమలు నెలకొల్పానని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో కృషి చేయాలన్నారు. సంఘ సేవకురాలు సత్యవాణి మాట్లాడుతూ తల్లితండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలన్నారు. ట్రస్టు కార్యదర్శి కోనేరు భీమేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వానా ఉత్తమ ప్రతిభ చూపే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. నేడు 11 నగరాలు 39 కాలేజీలో చదువుతున్న 60 మంది బాలికలకు, 30 మంది విద్యార్థులకు రూ 9.25 లక్షలు ఉపకారవేతనాలు అందజేశామని తెలిపారు. వైద్య విద్యార్థులకు రూ 15 వేలు, మిగితా విద్యార్థులకు రూ 10 వేల చొప్పున అందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నరేంద్రబాబు, వ్యవస్థాపక ట్రస్టీ వాసు దేవరావు, నార్లమాలతి, కోనేరు తరుణ్, ట్రస్టీలు నాగేశ్వరరావు, రాధాకృష్ణ, రవీంద్రనాథ్‌ఠాగూర్, వెంకటరామారావు, మాజీ సర్పంచి కోనేరు కోటేశ్వరరావు, స్థల దాతలు నాగేశ్వరరావు, విజయకుమారి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్

రామవరప్పాడు: నున్నలోని మదర్‌థెరిస్సా ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల కేంద్రం, వృద్ధాశ్రమంలో ఆదివారం రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల కందిపప్పు, 30 లీటర్ల వంటనూనె, బట్టల సబ్బులు, టూత్ పేస్ట్‌లతో పాటు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఏఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో నిజమైన ఆనందం ఉంటుందన్నారు. సుమారు రూ.20వేలు విలువజేసే నిత్యావసరాలు, దుస్తులు అందజేసినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న సమయంలో శాంతి భద్రతలను కాపాడుతూ సమాజానికి ఎంతో సేవ చేశామన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత అసోసియేషన్ ద్వారా సమాజ సేవ చేయడం సంతృప్తిని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మురహరి రవీంద్రనాథ్ ఠాగూర్, మాజీ కోశాధికారి మూర్తి, కోశాధికారి రాజారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు, సభ్యులు మహేష్, పట్టయ్య, నాంచారయ్య, మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు

గన్నవరం: స్థానిక విశ్వభారతి సైనిక్ స్కూల్ ఆవరణలోని మన హక్కుల కోసం పోరాడు సాధించు ఉద్యమ సంస్థ కార్యాలయంలో ఆదివారం సమాచారం హక్కు చట్టం-2005(ఆర్టీఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు పొందడానికి, పాలనలో పారదర్శకతను తీసుకురావడంలో సమాచార హక్కు చట్టం కీలకంగా మారిందన్నారు. ఈ చట్టంపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూఎఫ్ఐ ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాలకులు, అధికారులను ప్రజలు ప్రశ్నించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ చట్టం వల్ల సేకరించిన సమాచారం ద్వారా లోకాయుక్త, కోర్టులను ఆశ్రయించి అనేక విజయాలు సాధించినట్లు గుర్తుచేశారు. పౌర సమాజం ఐక్య వేదిక అధ్యక్షుడు కురగంటి హనుమంతరావు, ఐఏవీఓ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, సామాజిక కార్యకర్తలు బేతపూడి జోగేశ్వరరావు, డాక్టర్ కొత్తపల్లి సత్యం నారాయణ, సీహెచ్. హేమలత, కోట కెంపురాజు, ఇటుకల నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా డ్రెయిన్లు



డ్రెయినేజీ పై సిమెంట్ బిళ్లలు వేయకుండా వదిలేసిన వైనం

పెనమలూరు: చోడవరం గ్రామంలో చాలా కాలం క్రితం నిర్మించిన డ్రెయినేజీ పనులు పూర్తి చేయక పోవటంతో గ్రామస్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. చోడవరం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు (రామాలయం రోడ్డు) నుంచి గ్రామం ప్రధాన రహదారి పక్కన సుమారు 700 మీటర్ల డ్రెయిన్‌ను సంవత్సరం క్రితం నిర్మించారు. ఈ డ్రెయిన్ నిర్మాణం తిన్నగా లేకుండా అనేక వంకర్లు తిరిగింది. ఇది ఇలా ఉంటే డ్రెయిన్ నిర్మించిన తరువాత అంతర్గత రోడ్ల నుంచి ప్రధాన రహదారికి రావటానికి సంబంధించిన పనులు పూర్తి చేయలేదు. డ్రెయిన్లపై సిమెంట్ బిళ్లలు వేయలేదు. దీంతో రాత్రిళ్లు డ్రెయిన్ సరిగా కనపడక పోవటంతో ప్రమాదానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించటం లేదని స్థానికులు వాపోతున్నారు. వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. చోడవరం గ్రామంలో పంచాయతీ పాలన పూర్తిగా అటకెక్కిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల అధికారులైనా స్పందించి చోడవరంలో పాలన గాడిలో పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పనిచేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

ఏళ్లు గడుస్తున్నా అంతే..



అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణం

గన్నవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నూతన భవనం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించిన పాత భవనంలోనే తహసీల్దారు కార్యాలయం కొనసాగుతుంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణం చేపట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణం కోసం తొలుత రెండు అంతస్తుల మేర శ్లాబ్ నిర్మించారు. అయితే నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో నిర్మాణ పనులను మధ్యలోనే కాంట్రాక్టర్ నిలిపివేశారు. అప్పటి నుంచి నిధులు లేమి కారణంగా నిర్మాణ పనులు ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే అధికారులు విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన భవన నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం



సినీ నిర్మాత అమర్‌ను సన్మానించిన చైర్మన్ మోహన్

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు పాల పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న సినీ నిర్మాత అమర్

మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని చిరంజీవి క్రియేషన్స్ అధినేత, ధర్మ కార్య సంస్థ ప్రతినిధి చల్లపల్లి అమర్‌ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు అమర్‌ను శేష వస్త్రంతో సన్మానించి.. అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.